# 6

# పర్షియా నాగరకత

ప్రాచీన పర్షియాదేశము కాస్పియన్ సముద్రానికి దక్షిణంగాను, తుర్కీ దేశానికి ఆగ్నేయంగాను, ఇరాక్ దేశానికి తూర్పుగాను, పర్షియా సింధుశాఖకు ఉత్తరంగాను ఉండేది (దేశపటము 9). దీనికే నేడు ఇరాక్ దేశమని పేరు. సుమారు క్రీ. పూ. 500 నుంచి క్రీ. పూ. 350 వరకు ప్రాచీన ప్రపంచాన్ని పర్షియా నిరవధికంగా ఏలింది. నాటి సామ్రాజ్యాలలో అత్యంత విస్తీర్ణం కలిగినది పర్షియా సామ్రాజ్యము. క్రీ. పూ. 6 వ శతాబ్దంలో పర్షియన్లు తమలో ఐక్యములేక అనేక తెగలు ఇరాన్ నైఋతిభాగంలో మీడ్జ్ (Meddes) ఏలుబడికింద ఉండేవారు. క్రీ. పూ. 559 లో సైరస్ అనే రాకుమారుడు పసార్‌గడీ తెగకు ఆన్‌షాన్ రాజ్యంలో అధిపతి అయినాడు. ఇతనిని చరిత్రలో 'సైరస్ ది గ్రేట్' అని అంటారు. పర్షియా సామ్రాజ్యానికి పునాదులు వేసింది ఇతడే.

## సైరస్ ది గ్రేట్ (Cyrus the Great)

(క్రీ. పూ. 559–క్రీ. పూ. 529)

సైరస్ పర్షియన్ తెగలనన్నిటినీ ఏకంచేసి బాబిలోనియా రాజైన నేబోనైడస్ (Nabonidus) సహాయంతో మీడ్జ్‌ను ఎదిరించి, ఏక్‌బెటన (Ecbatana) నగరాన్ని వశపరచుకొని చివరకు క్రీ. పూ. 550 లో మీడ్జ్ సామ్రాజ్యాన్ని అంతమొందించినాడు. ఈ విధంగా సైరస్ పర్షియా, మీడ్జ్ దేశాలను స్వాధీనం చేసుకొనినాడు. క్రీ పూ. 547 లో లిడ్‌య (Lydia) రాజైన క్రీజూస్ (Croesus) ను ఓడించి అతని రాజ్యాన్ని, ఆ రాజ్యానికి లోబడిఉన్న గ్రీకు వలసలను పర్షియా సామ్రాజ్యంలో కలిపినాడు. బాబిలోనియా రాజైన నేబోనైడస్‌ను ఓడించి క్రీ. పూ. 539 లో బాబిలోనియా సామ్రా

జ్యాన్ని తన సామ్రాజ్యంలో చేర్చుకొన్నాడు. సైరస్ హిందూకుష్ పర్వతప్రాంతంవరకూ దండెత్తినాడు. సైరస్ క్రీ. పూ. 529 లో మరణించగా అతని కుమారుడు కాంబైసీస్ (Cambyses) రాజ్యానికి వచ్చినాడు. అతడు క్రీ. పూ. 525 లో ఈజిప్టుపై దండెత్తి ఆ దేశాన్ని ఆక్రమించినాడు. అతని తరవాత డరయస్ (Darius) రాజయినాడు.

## డరయస్ ది గ్రేట్ ( Darius the Great )
( క్రీ. పూ. 521-క్రీ. పూ. 486 )

పర్షియాను ఏలిన చక్రవర్తులలోనే గొప్పవాడు డరయస్ ది గ్రేట్. ఇతడు సైరస్, కాంబైసీజ్ 'ఎకేమినిస్' (Achaemenes) వంశానికి చెందినవాడు. అందుకనే వీరికి 'ఎకేమినిడ్జ్' (Achaemenids) అని పేరు వచ్చింది. డరయస్ క్రీ. పూ. 521 నుంచి క్రీ. పూ. 486 వరకు రాజ్యాన్ని పరిపాలించినాడు. ఇతడు మీడియా, బాబిలన్, అర్మీనియా మొదలైన చోట్ల జరిగిన తిరుగుబాట్లను అణచి పర్షియా ప్రాబల్యాన్ని సుస్థిరంగా నెలకొల్పినాడు. అతడు తన సామ్రాజ్యాన్ని తూర్పున హిందూదేశంవరకూ, పశ్చిమాన యూరపు వరకూ విస్తరింప జేసినాడు. కాని డాన్యూబ్‌నది ఉత్తరాన ఉన్న సిథియను (Scythian) లతోను, గ్రీకులతోను జరిగిన పోరాటాలలో పరాజయము పొందినాడు.

డరయస్ హామురాబీ లాగా న్యాయచట్టాలను క్రోడీకరించినాడు. అతడు సామ్రాజ్యమంతా ఒకేరకమైన తులామానాలను ప్రవేశపెట్టినాడు. ఇతడు నైలునదినీ ఎఱ్ఱసముద్రాన్నీ కలపడానికి, ఈజిప్టు రాజైన నీకో (Necho) ప్రారంభించిన కాలువను పూర్తిచేసినాడు. డరయస్ సిథియనులను జయించి మధ్యఐరోపా వర్తక మార్గాలను చేపట్టే యత్నంలో విఫలుడయినాడు, కాని హిందూదేశంనుంచి ఈజిప్టుకు సముద్రమార్గాన చేరే యత్నంలో అతడు కృతకృత్యుడయినాడు. డరయస్ కాలంలో బాబిలన్, సూస (Susa), ఎక్బెటన నగరాలలో అనేక భవనాలు నిర్మితమయినాయి. ఇతని నిర్మా

ణాలలో అతి ముఖ్యమైనది పర్షియాలో నెలకొల్పిన నూతన రాజధాని నగరము పర్సెపోలిస్ (Persepolis). ఇందులో ప్రధానంగా డరయస్ నిర్మించినవి ఒక రాజప్రాసాదము, సభా భవనము, కోశాగారము అపదన (Apadana) అనే దర్శనగృహము (Audienal hall)

గ్రీకు యుద్ధాలలో అపజయం పొందడం మూలాన పర్షియా సామ్రాజ్యము క్షీణించడం ప్రారంభించింది. అంతటితో పర్షియన్ల ఐక్యము అంతరించి, అంతఃకలహాలు, తిరుగుబాట్లు ఎక్కువ అయినాయి. చివరకు క్రీ. పూ. 330లో అలెగ్జాండరు (Alexander) పర్షియాను ఆక్రమించి, పర్షియా సామ్రాజ్యాన్ని అంతమొందించినాడు.

పర్షియన్ల నాగరకత బాబిలన్, అసీరియా నాగరకతల నుంచి అనేక విషయాలను గ్రహించింది. ఉదాహరణకు వారు సామ్రాజ్య పద్ధతిని అసీరియన్ల నుంచి, వ్రాతవిధానాన్ని బాబిలోనియన్ల నుంచి గ్రహించి తమ అవసరాలకు తగినవిధంగా మలచుకొనినారు. కాని ప్రాచీన సంప్రదాయాలను ఉన్నవాటిని అదే విధంగాకాక, వాటికి నూతన విషయాలను కూర్చి వీరు తమ ప్రత్యేకతను చూపించినారు. పర్షియా ప్రభుత్వ విధానాన్ని, మతాన్ని, వ్రాతవిధానాన్ని పరిశీలిస్తే ఈ విషయం వ్యక్తమౌతుంది.

## రాజకీయ వ్యవస్థ

పర్షియారాజు 'మహాచక్రవర్తి' అనే బిరుదందాల్చి పరిపాలించినాడు. అతనిని దేవాంశ సంభూతుడుగా భావించేవారు. మొదట ఆతడు కొందరు కులీనులను దగ్గరచేర్చి వారి సలహాలను పాటించినా, క్రమేణా వారిని కూడా దూరంగాఉంచి తాను ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకొనినాడు. సామ్రాజ్యము 30 సేత్రపీలు (Satrapys) లేదా మండలాలుగా విభజించినాడు. ప్రతిమండలానికి సేత్రపు(Satrap) అనే ప్రతినిధి ఉండేవాడు. రాజకుమారులను, కులీనులను సేత్రపులుగా నియమించేవాడు. తిరుగుబాట్లులేక రాజ్యాధికారం సుస్థిరంగాఉన్న ప్రదేశాలలో స్థానిక పరిపాలకులనే ప్రతినిధులుగా నియమించేవాడు.

ఇందువల్ల స్థానిక సమస్యలను పరిష్కరించడం సులభమయ్యేది. సామ్రాజ్యంలో ముఖ్యనగరాలలో, కీలకస్థానాలలో పర్షియన్ సేనలు రక్షణకు స్థావరాలను ఏర్పరచుకొన్నాయి. పర్షియాసామ్రాజ్యం జనాభాలో పర్షియన్లు నూటికి ఇద్దరుకూడా ఉండేవారుకారు. సామ్రాజ్యంలో పర్షియన్లకన్న పర్షియేతరులే అధికంకావడం పర్షియన్ల పతనానికి దారితీసింది. ఈజిప్షియనులు, గ్రీకులు పర్షియాపాలనకింద ఉండడాన్ని ఏవగించుకొనినారు. ఇట్టి సామ్రాజ్యాన్ని పర్షియన్లు ఎక్కువకాలం రక్షించుకోలేక పోయినారు.

## ఆర్థిక వ్యవస్థ

పర్షియా సామ్రాజ్యము ఆర్థికంగా సంపన్న సామ్రాజ్యంగా ఉండేది. సిసెరోనాటి రోమురిపబ్లిక్ కన్నా పర్షియా ఆదాయము 50 శాతం ఎక్కువగా ఉండేది. వర్తక వ్యాపారాల మూలంగాను, యుద్ధ విజయాలవల్ల, పర్షియా విశేష ధనాన్ని ఆర్జించింది. పర్షియా పోటీవల్ల గ్రీసు వ్యాపారము బాగా దెబ్బతిన్నది.

## మతము

ప్రాచీన పారశీక మతము బహుదేవతలు కలదిగానూ, ప్రకృతి ఆరాధన ప్రధానంగా కలదిగానూ ఉండేది. 'మిత్ర' (Mitra) అనే పేరున్న సూర్యదేవుడు, 'అనహిత' (Anahita) అనేపేరున్న మాతృదేవత వారి ప్రధాన ఆరాధ్యదేవతలు. ప్రాచీన పారశీకులు దేవాలయాలను నిర్మించలేదు. వారి మతానికి అవసరమైన అగ్నివేదికలు ఆరుబయలులో నిర్మించుకొనేవారు. ఈ పరిస్థితులలో పర్షియాలో ఒక గొప్ప మతప్రవక్త ఉదయించినాడు. అతడే జోరోస్టర్ (Zoroaster) లేదా జారతుస్ట్రి (Zarathustra).

జోరోస్టర్ కాలనిర్ణయంపై అనేక వాదాలు ఉన్నాయి. కొందరు గ్రీకు రచయితలు జోరోస్టర్ ట్రోజన్ (Trojan) యుద్ధానికి 5000 ఏండ్ల కిందటివాడని పేర్కొన్నారు. మరికొందరు 6000 ఏండ్ల కిందటివాడని పేర్కొన్నారు. ఇరాన్‌లోని 'పహ్లావీ' (Pahlavi)

(ఇరానియన్ భాష) గ్రంథ సంప్రదాయాన్ని అనుసరించి మరికొందరు జోరోస్టర్ గ్రీకు విజేత అలెగ్జాండరుకు 300 సంవత్సరాలు మాత్రమే పూర్వుడని వాదిస్తున్నారు. ఈ దృష్టిలో ఈయనకాలము క్రీ. పూ. 6వ శతాబ్దము. మొత్తముమీద జోరోస్టర్‌ను గూర్చిన అభిప్రాయ భేదములను సమన్వయ పరచడం కష్టము. జోరోస్టర్ స్పష్టంగా చారిత్రక వ్యక్తిగా కనిపిస్తున్నా, తరవాతి రచనలు కొన్ని ఆయనకు దివ్యశక్తుల నారోపించి కేవల పురాణపురుషునిగా ఆయనను చిత్రించినాయి. జోరోస్టర్ జీవితానికి సంబంధించిన వివరాలు అత్యల్పంగా మనవరకూ వచ్చినాయి. 'అవెస్తా' (Avesta)లో కొన్ని భాగాలు, 'పహ్లావీ' సంప్రదాయ గ్రంథాలు మాత్రమే నేడు మిగిలి ఉన్నాయి. వీటినుంచి జోరోస్టర్ స్థాపించిన మతస్వరూపం తెలుస్తున్నది.

మహా ప్రవక్తలు అందరిలాగానే జోరోస్టర్ కూడా లోక సంగ్రహార్థమే అవతరించినాడు. నాటి ఇరానియనుల ఆచారాలలో సంఘశ్రేయోదాయకాలు, ప్రయోజనకరాలు అయిన వాటిని మాత్రమే ఆమోదించి, సంఘానికి వేరుపురుగులవంటి ఆచారాలను జోరోస్టర్ సమూలంగా నిర్మూలించినాడు. బహు దేవతారాధనను నిషేధించి, ఆ దేవతలందరి స్థానాన ఆహురమేజ్ద (Ahura - Mazda) అనే ఒకే ఈశ్వరుని ప్రతిపాదించినాడు. అంతటితో పర్షియాలో అంతవరకూ ఆరాధించబడుతున్న దేవతలందరూ రూపుమాసి పోయినారు. దేవతలకు జంతు బలినివ్వడం కూడదని ఆయన ప్రకటించాడు. ఈ జంతుబలి నిషేధము జోరోస్టర్ సాధించిన ప్రముఖ సంస్కరణాలలో ఒకటి. అతని కాలంలో ప్రజలు 'హోమ' (Homa) అనే మొక్క రసాన్ని తాగడానికి అలవాటుపడినారు. ఆ రసంలో అత్యద్భుతమైన గుణాలు ఉన్నాయని వారు భావించినారు. తాగుడు వల్ల కలిగే దుష్ఫలితాలన్నీ దీనివల్ల కలుగుతూఉండేవి. 'హోమ' రసపానాన్ని జోరోస్టర్ నిషేధించినాడు. ఇండో, ఇరానియన్ దేవతలలో 'అగ్ని' ప్రధానమైనది. అందుచేత జోరోస్టర్ 'ఆతర్' (Atar) లేదా అగ్నిదేవత ఆరాధనము మాత్రము కొనసాగించడం

అవసరమని భావించినాడు. మంచి, చెడు అనే రెండు శక్తుల మధ్య జరిగే సంఘర్షణకు ఈ ప్రపంచము రంగస్థలమని ఆయన బోధించినాడు. ఆ రెండు శక్తులకూ 'స్పెంతామఈన్యూ' (మంచితనము లేదా అభ్యుదయశక్తి), 'అంగ్రామఈన్యూ' (చెడ్డతనము లేదా వినాశకశక్తి) అనీ ఆయన పేర్లు పెట్టినాడు. ఈ రెండు శక్తుల సంఘర్షణలో అంతిమ విజయము స్పెంతా మఈన్యూదేనని అతడు బోధించినాడు. తనచుట్టు ఉన్న సమాజము అవినీతిపరులతో నిండిఉండడంవల్ల 'వోహూమనో' (విశుద్ధ మనస్సు) ప్రాశస్త్యాన్ని గురించి ప్రబోధించడం అవసరమని జోరోస్టర్ గుర్తించినాడు. ఆయన సిద్ధాంతము స్వర్గము నరకము మనో ప్రవృత్తిచే మనము సృష్టించుకున్నవే అని. సుగుణములన్నిటిలోను శ్రేష్ఠమైనది 'ఆషా'. ఋజుత్వము, పవిత్రత, విశుద్ధ వర్తనము మొదలైన పలు భావాలు ఈ శబ్దంలో ఇమిడి ఉన్నాయి. దుష్ట శక్తులతో మానవుడు సాగించే సంగ్రామంలో ఇదే అతని ప్రధానమైన ఆయుధము. జోరోస్టర్ 'ఆర్మైటీ' (భక్తి)కి అమితప్రాధాన్యం ఇచ్చినాడు. ఆషా, ఆర్మైటీలద్వారా తప్పక పరమార్థ సాక్షాత్కారము కలుగుతుంది. జోరోస్టర్ మతము సన్యసించడాన్ని నిషేధించింది. మానవసేవ ద్వారాపొందదగిన మోక్షాన్ని సన్యాసంద్వారా సాధించ ప్రయత్నించడం స్వార్థపరత్వమని ఈ మతం నిరసించింది.

పర్షియా సామ్రాజ్యంలో మత సామరస్యము ఉండేది. పర్షియా చక్రవర్తులు తాము జోరోస్టర్ మతాన్ని స్వీకరించినా అందరినీ ఆ మతాన్ని స్వీకరించమని బలవంతం చేయలేదు. ఈ పద్ధతిని మత విషయంలో అనుసరించడం మూలాన పర్షియా అనేకులను మిత్రులుగా ఉంచుకోగల్గింది. ఉదాహరణకు జరూసలమ్‌ను యూదులకు ఇచ్చివేసింది.

పర్షియనుల భాషా సారస్వత కళా సంపద చాలావరకు మెసొపొటేమియా, లిడియా, ఉత్తర పాలస్తీను నాగరకతలనుంచి గ్రహించబడింది. పర్షియనుల లిపి మొదట్లో బాబిలోనియా క్యూనియఫారమ్

లిపి. క్రమేణా అరామియనుల వర్ణమాలను పోలిన 33 అక్షరాల వర్ణమాలను వారు ఏర్పరచుకొనినారు. పర్షియన్లు ఈజిప్టు సిద్ధాంతాన్ని (Calendar) అనుసరించినారు. వీరు వాస్తు పద్ధతిలో బాబిలన్ అసీరియా నిర్మాణ విధానాలను అవలంబించినారు. పర్షియన్లు దేవాలయాలను నిర్మించలేదు. వారి భవనాలలో ముఖ్యమైనవన్నీ రాజప్రాసాదాలు. పర్షియా భవనాలలో అత్యంత ముఖ్యమైనవి పర్సెపోలిస్ నగరంలోని డరయస్, జర్ క్సీజ్ చక్రవర్తుల ప్రాసాద భవనాలు.